కథానిక

# చెదిరిన పూలు*

'వసంత'

"ఇదే మా ఆఫీసర్‌గారి ఇల్లు" అన్నాడు సురేష్ గేటువైపు దారితీస్తూ.

కౌసల్య తలఎత్తి చూసింది. పెద్ద బంగళా. తన భర్త పనిచేస్తున్న కంపెనీ ఆఫీసర్‌గారికి తగినట్టుగా అన్ని హంగులూ వున్నాయి అనుకుంది.

"నేను ఎందుకు బాబూ, నేను ఇక్కడే వుంటాను. ఆ టెలిగ్రామ్ ఇచ్చేసి రావడమే కదా. ఎంతసేపు. మీరు వెళ్ళసి రండి" అంది కౌసల్య.

"ఛీ! అలా ఏం బావుంటుంది. నువ్వూ కూడా రా. పరిచయం చేస్తాను. అందులో ఆయన మనిద్దర్నీ టీకి పిలిచాడు కూడాను. రా, వెళ్ళి ఐదు నిమిషాలు కూర్చుని వచ్చేద్దాం" అన్నాడు సురేష్ బంగళాలోకి దారితీస్తూ. కౌసల్య జంకుతూ సురేష్ వెనకే నడిచింది.

సురేష్ కాలింగ్ బెల్లు నొక్కాడు.

ఒక నిమిషం గడిచింది. ఎవరో మెట్లు దిగుతున్న చప్పుడు అయింది. ఇంతలో తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా ఆఫీసర్.

"గుడ్ ఈవినింగ్ సార్" అన్నాడు సురేష్.

"హల్లో! కమిన్. ఆమే? ఓ వెల్‌కమ్. రండి రండి" అన్నారు ఆఫీసర్‌గారు సాదరంగా.

"ఈయనే మా ఆఫీసర్‌గారు. నా మిసెస్ కౌసల్య సార్" అంటూ తన భార్యను పరిచయం చేసాడు.

కౌసల్య చేతులు జోడించింది. ఆయన ప్రతి నమస్కారం చేస్తూ "రండి లోపల కూచుందాం" అంటూ డ్రాయింగ్ రూమ్‌లోకి దారి తీసాడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఆఫీసర్‌గారి పెళ్ళాం పిల్లలు ఏమయ్యారా అని ఆలోచిస్తున్నాడు సురేష్.

అతని ఆలోచనలు పసిగట్టిన వాడిలా "మా వాళ్ళు ఇవాళ పొద్దున వూరెళ్ళారోయ్. మా మామ గారికి వంట్లో బావోలేదని ఫోను వచ్చింది. అందుకే నేను ఇవాళ సెలవు పెట్టాను. ఏమిటి ఆఫీసు విశేషాలు?" అని ప్రశ్నించారు ఆఫీసరు గారు.

"మధ్యాహ్నం మీ పేరున ఒక టెలిగ్రామ్ వచ్చింది సార్. పెర్సనల్ మేటర్ ఏమోనని పట్టుకు వచ్చాను. ఇదుగో సార్! టెలిగ్రామ్" అంటూ సురేష్ టెలిగ్రామ్ జేబులోంచి తీసి ఇచ్చాడు.

ఆయన అందుకుని చింపి చూసాడు. ఓ! ఐ సీ! అన్నాడు.

'వాట్ సార్?' అన్నాడు సురేష్ ఖంగారుగా. కొంపతీసి వాళ్ళ మామ గారు పోలేదు కదా అనుకున్నాడు.

"మన కాంట్రాక్టర్ గుర్నాధం ఫైలు అప్టుడేట్‌గా వుందా?" అన్నారు ఆఫీసర్‌గారు.

"ఆ, వుంది సార్. నిన్ననే రడీ చేసేసాను. మీరు సంతకం పెట్టడమే తరువాయి" అన్నాడు సురేష్.

"రేపు పొద్దునే ఫ్లయిట్‌లో దిగుతాట్ట. 'సరాసరి ఇక్కడికే వచ్చేస్తాను. కాయితాలు రడీ చేసి వుంచండి. పని ముగించుకుని నెక్స్ట్ ఫ్లయిట్‌లో వెళ్ళిపోతాను' అంటూ టెలిగ్రామ్ ఇచ్చాడు. ఇప్పుడేం చెయ్యడం?" అంటూ ఆయన ఆలోచనలో పడ్డాడు.

రెండు సార్లు అటూ ఇటూ పచార్లు

---

* జూన్ నెలలో జరిగిన కథానికా పఠనంలో చదివినది.

చేసాడు. చేతి గడియారంకేసి చూసుకున్నాడు.

సురేష్, కౌసల్య ఆయనకేసే చూస్తు న్నారు ఏమి చెబుతారా అని. "సురేష్ ఆఫీసుకు వెళ్ళి ఆ ఫైలు పట్టుకు రావాలా? కారులో వెళ్ళిరావచ్చు గాని. డ్రైవర్‌ను పంపు తాను. పది నిముషాల్లో వెళ్ళి వచ్చేయవచ్చు గాని. ప్లీజ్" అన్న ఆఫీసర్ గారి మాటలకి సురేష్, కౌసల్యలు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"అలాగే సార్. వెళ్ళొస్తాను" అని సురేష్ అనగానే ఆయన గబగబా డ్రైవర్‌ని పిలవడానికి బయటకు వెళ్ళారు.

"కౌసల్యా, ఇక్కడే వుండు. పది నిముషాల్లో వచ్చేస్తాను. ఆయనకు ఫైలు ఇచ్చేసిన తరువాత మనం బజారుకు పోదాం" అన్నాడు సురేష్.

"నేను ఒక్కర్తెని ఇక్కడ వుండను బాబూ. నేనూ మీతో వస్తాను" అంది కౌసల్య.

భార్యను కూడా కారులో తీసుకు వెడితే, ఆఫీసర్‌గారు ఏమనుకుంటారోనని సురేష్ భయం. తను మామూలు గుమాస్తా. ఆయన కారులో వెళ్ళడమే గొప్ప. నీకు తోడు నీ పెళ్ళాం కూడానా అంటే. అసలే ఆయన పరమ స్ట్రిక్టు మనిషి.

కౌసల్య ఏదో చెప్పబోతున్నదల్లా, ఆఫీ సర్ గారు రావడంతో ఆగిపోయింది.

"సురేష్, కారు రడీగా వుంది. డ్రైవర్‌కి చెప్పాను. తాళాలు దారిలో ఆగి మేనేజర్‌గారి దగ్గిర తీసుకో. ఏమ్మా, నువ్వు ఇక్కడే వుంటావా? మీ ఆయన ఇప్పుడే వచ్చేస్తాడు" అన్న ఆఫీసర్ మాటలకి ఏం జవాబు చెప్పాలో తోచలేదు కౌసల్యకి.

"అలాగే సార్. ఇక్కడే వుంటుంది" అంటూ కౌసల్యకేసి ఏం భయం లేదులే అన్నట్టు చూసి బయటకు నడిచాడు సురేష్.

ఆఫీసర్‌గారి కారులో వెళ్ళే అవకాశం వచ్చినందుకు మురిసిపోతున్నాడు సురేష్. తనూ ఎప్పటికైనా ఆఫీసర్ అయితే ఇలాగ కారులో తను, తన భార్య తిరగవచ్చు అను కున్నాడు మనసులో.

ఫైళ్ళు పట్టుకొని తిరిగివస్తూ దారిలో మేనేజర్ గారింటి దగ్గర ఆగి తాళాలు ఇచ్చేసి కారు ఎక్కబోతుండగా "అయ్యా, నన్ను జాజి పూలు, మూర పావలా" అంటూ పూలు అమ్మే కుర్రాడు ఆశగా కారు దగ్గరకు వచ్చాడు.

కౌసల్యకి సన్నజాజి పూలు అంటే చాలా ఇష్టం అని గుర్తువచ్చింది. గబగబా పూలు కొన్నాడు. ఈ ఆలస్యానికి డ్రైవర్ తిట్టు కున్నాడేమోనని భయం వేసింది.

ఇంతలో కారు ఆఫీసర్ గారింటికి చేరు కుంది. పూల పొట్లం పాంటు జేబులో కుక్కి చేతిలో ఫైలుతో కారు దిగి లోపలకు నడి చాడు. లోపలికి అడుగు పెట్టగానే కనపడిన దృశ్యం చూసి సురేష్‌కు ఒక్కసారి గుండె ఆగినట్టు అయింది. చేతిలోని ఫైలు జారి పడిపోయింది. డ్రాయింగ్ రూమ్ అంతా చిందరవందరగా వుంది.

గుమ్మానికి కడ్డంగా నేల మీద కంచు ఫ్లవర్ వేస్.

అంతటా చెదిరి పడివున్నవి దానిలోని పూలు.

ఆఫీసర్ గారు నేలమీద పడివున్నారు. తల చుట్టూ రక్తం మడుగు.

ఆ మూల సోఫాలో కౌసల్య. కళ్ళు చింత నిప్పుల్లా వున్నాయి. ఆయాసంతో రొప్పుతూ వుంది. జుట్టు అంతా రేగిపోయింది. మొహ మంతా రక్కులు, చీరా, జాకెట్టు చింకి పీలి కల్లా చిరిగి వున్నాయి. "మీరు వెళ్ళగా చూసి వీడు" అంటూ కౌసల్య వెక్కి వెక్కి చెబు తున్న మాటలు సురేష్‌కి అస్సలు వినిపించ లేదు.